

## 25 శాతం సీట్ల భర్తీకి 31వరకు గడువు

### డిఇఒ ప్రేమ్ కుమార్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లాలోని అన్ని ప్రైవేట్ అన్- ఎయిడెడ్ పాఠశాలల్లో .సి బిఎస్ఇ, రాష్ట్ర సిలబస్ లో 1 వ తరగతిలో ప్రవేశానికి 25శాతం ఉచిత సీట్లను ప్రభుత్వం కల్పిస్తోందని డిఇఒ ప్రేమ్‌కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 31వరకు సమగ్ర శిక్ష పథక రాష్ట్ర సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు cse.ap.gov.in పోర్టల్‌లో ఈనెల 31లోగా వివరాలను నమోదు చేసుకోవాలని తెలిపారు.

# నాడు అసమ్మతి రాగం నేడు మౌనగీతం



- రాజాంలో కిమిడి కళా వెంకటరావు అనుయాయులు, గ్రామస్థాయి నుంచి అభ్యర్థి కోండ్రు మురళి రాజకీయాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి /రేగిడి

**నాడు అసమ్మతి రాగం తీసిన గ్రూపు నేడు మౌన గీతం పాడుతోంది. ఈ గ్రూపును పెంచిపోషించిన నాయకుడికి అసెంబ్లీ టిక్కెట్ విషయంలో ఆశాభంగం కలిగింది. ఈ పరిణామాలు జరుగుతుండగానే ఎమ్మెల్యే అభ్యర్థి గ్రామస్థాయి రాజకీయాలు ముమ్మరం చేసుకున్నారు. దీంతో, ఢీలాపడ్డ అనుయాయులు స్తబ్ధతగా ఉన్నారు. మండల స్థాయి నాయకులు ఒకవైపు, పార్టీ గ్రామ స్థాయి కేడర్ మరోవైపు అన్నట్టుగా ఉంది. ఈ పరిస్థితి ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో... అన్న ఆసక్తితో జనంతోపాటు రాజకీయ పరిశీలకులు చర్చించు కుంటున్నారు. ఇదీ రాజాం నియోజకవర్గంలో ప్రస్తుతం టిడిపి పరిస్థితి.**

జిల్లా పునర్విభజనలో భాగంగా రాజాం నియోజకవర్గం శ్రీకాకుళం నుంచి విజయనగరం జిల్లాలోకి మారిన విషయం విధితమే. టిడిపి తరపున మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్‌తోపాటు మాజీ స్పీకర్ కావలి ప్రతిభా భారతి కుమార్తె గ్రీష్మ కూడా టిక్కెట్ ఆశించారు. ఇదే నియోజకరవ్గంలో నివాసం ఉంటున్న మాజీ మంత్రి కిమిడి కళావెంకటరావు తిరిగి ఎచ్చెర్ల అసెంబ్లీ టిక్కెట్ ఆశించారు. రాజాంలో కోండ్రుకు, ఎచ్చెర్లలో బిజెపి అభ్యర్థి ఎన్ఇఆర్‌కి కేటాయించడంతో అటు గ్రీష్మ, ఇటు కిమిడి కంగుతిన్నారు. ఇదే అనుమానంతో ప్రతిభా భారతి తొలి నుంచీ కోండ్రుకు దూరంగా ఉంటూ వచ్చారు. ఆమె గ్రూపునకు గతంలో ఇదే నియోజకవర్గం నుంచి మంత్రిగా పనిచేసిన కిమిడి ఆనుయాయులు కూడా తోడయ్యారు. సుమారు ఆరు నెలల క్రితం నుంచి రాజాంలో కోండ్రు, ప్రతిభా భారతి శిబిరాలు వేర్వేరుగా సాగాయి. తొలి నుంచీ కిమిడికి ఆనుయాయులుగా ఉన్న వంగర మండలం మాజీ ఎంపిపి పైలా వెంకటరమణ, పిఎసిఎస్ అధ్యక్షులు ఉదయాన మురళి, సంతకవిటి మండలానికి చెందిన మాజీ ఎంపిపి కొల్లా అప్పలనాయుడు, కిమిడి రామకృష్ణం నాయుడు రాజాం మండలానికి చెందిన కేశవరావు ప్రతిభా భారతి గ్రూపులో ఉన్నారు. వీరంతా భారతి నాయకత్వంలో కోండ్రును వ్యతిరేకిస్తూ రహస్య సమావేశాలు నిర్వహించారు. ఒకానొక సందర్భంలో కోండ్రును బాహాటంగానే విమర్శించారు. ఈ వ్యవహారాల వెనుక కిమిడి హస్తం ఉందనే చర్చ కూడా నడిచింది. ఏం జరిగినా కిమిడి చూసుకుంటారనే భావనతో వీరంతా ఉండేవారు. అనూహ్య పరిణామాల నడుమ కిమిడి కళా వెంకటరావు ఆశించిన ఎచ్చెర్ల అసెంబ్లీ టిక్కెట్ చేజారిపోవడంతో రాజాంలోని ఆనుయాయ గ్రూపు గప్ చప్ అన్నట్టు స్తబ్ధ వాతావరణంలోకి వెళ్లింది. మొన్న కోండ్రును వ్యతిరేకించి, నిన్న అసమ్మతి రాగం తీసిన ఈ నాయకులంతా ప్రస్తుతం నోరు మెదపడం లేదు. తమ నేతలిద్దరికీ టిక్కెట్లు రాకపోవడంతో కొద్దిరోజులుగా మౌనంగా ఉంటున్నారు. ఇదే విషయమై భారతి, కిమిడి సంయుక్త గ్రూపునకు చెందిన నాయకులను ప్రజాశక్తి పలకరించగా పార్టీకి వ్యతిరేకంగా ఉండలేం కాదా.... అంటూనే ఇంకా కోండ్రుతో ప్రచారానికి వెళ్లలేదు కాదా? అంటూ సందిగ్ధ ప్రశ్నలు సంధిస్తుండడం గమనార్హం. మరోవైపు ఈ గ్రూపుల పోరుపై జిల్లా, రాష్ట్ర స్థాయి నాయకత్వం కూడా దృష్టిపెట్టినట్టుగా కనిపించడం లేదు.

**నాయకులను పట్టించుకోని కోండ్రు**

తొలి నుంచీ వ్యతిరేకిస్తున్న నాయకులను కోండ్రు ఏమాత్రం లెక్కచేయడం లేదు. గడిచిన రెండు నెలలుగా గ్రామ టిడిపి స్థాయి నాయకులతో మమేకమై ముందుకు సాగుతున్నారు. గతంలో కాంగ్రెస్‌లో పనిచేసిన అనుభవంతో నేటి ప్రత్యర్థిపార్టీలోని వారిని కూడా ఆకర్షిస్తూ పార్టీలోకి లాగే కార్యక్రమం నెలరోజులుగా సాగుతోంది. జనం ఆయన వెంట ర్యాలీ అవుతున్నప్పటికీ, మండల స్థాయి నాయకులు ఆటంకాలు సృష్టిస్తే కోండ్రు వ్యూహం నెరవేరుతుందా? అన్నది ప్రశ్న. ఎన్నికలకు మరో 45రోజులు సమయం ఉన్న నేపథ్యంలో ఇటువంటి చిక్కులు ఉన్నచోట అధిష్టానం దృష్టిపెట్టి సరిచేస్తుందని మరికొంతమంది విశ్లేషిస్తున్నారు. పరిణామాలు ఎలా మారుతాయో వేచి చూడాల్సిందే.

# ఎన్నికల్లో అప్రమత్తంగా వ్యవహరించాలి

ప్రజాశక్తి-రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్ల

ఎన్నికల్లో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా ఎన్నికల అధికారి ఎస్.నాగలక్ష్మి అన్నారు. పిఒగా విధులు నిర్వహించడం గొప్ప అవకాశమని పేర్కొన్నారు. ఒక్కతప్పు కూడా దొర్లకుండా ఎన్నికల ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల ప్రక్రియ, విధులు, ఇవిఎంలు, వివి ప్యాట్ల పనితీరుపై పిఒలు, ఎపిఒలు సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రాజాం, చీపురుపల్లి, నెల్లిమర్లలో ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు అయా నియోజకవర్గ కేంద్రాల్లో గురువారం శిక్షణ నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ, ఇవిఎంల పనితీరు, పిఒలు, ఎపిఒల విధులు, బాధ్యతలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఎన్నికల కమిషన్ రూపొందించిన వీడియోను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ శిక్షణా కార్యక్రమా లను కలెక్టర్ నాగలక్ష్మి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ రోజున, సంబంధిత పోలింగ్ బూత్‌లో పిఒదే పూర్తి అధికారమని చెప్పారు. అందరి విధులపైనా పిఒలకు అవగాహన ఉండాలని సూచించారు. రీ పోలింగ్‌కు ఎక్కడా అవకాశం ఇవ్వకూడదని, ఎట్టి పరిస్థితిలోనూ తప్పులు, పొరపాట్లు జరగ కూడదని స్పష్టం చేశారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను ఖచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. తమ వ్యక్తిగత అభిప్రాయాలను, అభిమానాన్ని ఎక్కడా ప్రదర్శించకూడదని స్పష్టం చేశారు. జిల్లాలోని 360 సున్నిత పోలింగ్ కేంద్రాల్లో మరింత అప్రమత్తంగా విధులను నిర్వహించాలన్నారు. ప్రతిచోటా పోలింగ్‌కు 90 నిమిషాల ముందే తప్పనిసరిగా మాక్ పోల్ నిర్వహించాలని చెప్పారు. మాక్ పోల్ అనంతరం ఇవిఎంలు డిలీట్ చేయాలని, వివి ప్యాట్లు ఖాళీ చేసి సీల్ చేయాలని సూచించారు. పోలింగ్ ఏజెంట్లుగా వాలంటీర్లు ఉండకూడదని స్పష్టం చేశారు. హ్యాండ్ బుక్, చేయాల్సిన, చేయకూడని జాబితా, చెక్‌లిస్ట్ లను తమతో పాటు ఉంచుకోవా లన్నారు. ముందురోజు రాత్రే తప్పనిసరిగా పోలింగ్ కేంద్రానికి చేరుకోవాలని, ఉదయం 5.30గంటలకే మాక్ పోల్ జరుగుతుంది కాబట్టి, ముందురోజు రాత్రే బూత్‌లు ఏర్పాట్లు పూర్తి చేసుకోవాలని సూచించారు. అందరికీ మొత్తం మూడు విడతల్లో శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఓటర్ల జాబితా సారిగా చూసుకొని ఒకటికి రెండుసార్లు తనిఖీలు చేసి ఓటు వెయ్యడానికి అనుమతించాలని సూచించారు. పోలింగ్ అధికార్లు నిర్లక్ష్యంగా ఉండరాదని తెలిపారు. కాగా పోలింగ్ రోజున ఎటువంటి ఘర్షణలు, అల్లర్లు జరగకుండా చూడాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌళిక సదుపాయాలు తప్పని సరిగా కల్పించాలని సూచించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్, అసిస్టెంట్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డిటిలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.

## 90 నిమిషాల ముందే మాక్ పోల్ : కలెక్టర్ నాగలక్ష్మి



ఎన్నికల సిబ్బంది శిక్షణలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

**లోపాలకు తావులేకుండా పోలింగ్ నిర్వహణ**

**విజయనగరం :** పోలింగ్ కేంద్రాల ప్రిసైడింగ్ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరిస్తూ పోలింగ్ నిర్వహణలో లోటుపాట్లకు తావివ్వకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ కె.కార్తీక్ ఆదేశించారు. నగరంలోని ఎం.ఆర్. కళాశాలలో జరిగిన శిక్షణలో ఆయన పోలింగ్ నిర్వహణపై పలు సూచనలు చేశారు. పోలింగ్ నిబంధనలపై పూర్తిగా అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎస్.కోట, నెల్లిమర్లలోనూ నిర్వహించిన శిక్షణ తరగతుల్లో జెసి పాల్గొన్నారు. కార్యక్రమంలో రిటర్నింగ్ అధికారులు నూకరాజు, మురళీకృష్ణ, విజయనగరం తహశీల్దార్ రత్నం, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు, గర్భిణీలు, బాలింతలు, 60ఏళ్ల దాటిన ఉద్యోగులకు, వికలాంగులకు ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.విజయగౌరి కోరారు. ఈమేరకు గురువారం గురుకుల పాఠశాలలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ. సాయిశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎండలు తీవ్రంగా వుండే మే నెలలో ఎన్నికలు జరగడంతో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారంతా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. వీరందరికి ఎన్నికల విధులు నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఎస్‌టియు జిల్లా నాయకులు జోగారావు కూడా వినతిపత్రం అందజేశారు.

## సెలవు దినాల్లోనూ ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 29, 31 సెలవు దినాలు అయినప్పటికీ ప్రభుత్వం వడ్డీ మాఫీ అవకాశాన్ని కల్పించినందున ఆస్తి , ఖాళీ స్థలాల పన్నులను చెల్లించుకునేందుకు వెసులుబాటుగా నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు తెరిచి ఉంటాయని కమిషనర్ ఎం.ఎం నాయుడు తెలిపారు. సచివాలయాలలో కూడా పన్నులు చెల్లించేందుకు ఈ రెండు రోజులూ వెసులుబాటు ఉందని తెలిపారపు. తెలియచేసారు. ఉదయం 8 గంటల నుండి పన్నులు చెల్లించేందుకు ప్రత్యేక కౌంటర్లు, సచివాలయాలు తెరిచి ఉంటాయని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఈనెల 31వ తేదీలోగా ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

## అగ్ని ప్రమాద బాధితులకు సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 19వ డివిజన్ లంకాపట్నం వద్ద పోలమాంబ గుడి సమీపంలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులను రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, కార్పొరేటర్ కంటభుక్త తవిటి రాజు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, స్థానిక కార్పొరేటర్ పొట్నూరు శ్రీనివాసరావు తదితరులు పరామర్శించి అవసరమైన నిత్యవసరాలు అందించి ధైర్యాన్ని నింపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి సూచనలతో అగ్ని ప్రమాద బాధితులను పరామర్శించా మన్నారు. నిత్యావసర సరుకులు, బట్టలను అందజేశామన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున సహాయ సహకారాలు అందే విధంగా కృషి చేస్తామన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- మరో ఇద్దరి పరిస్థితి విషయం
- మృతులు సాలూరు, జన్నివలస వాసులు

ప్రజాశక్తి - రామభద్రపురం/బాడంగి

విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలోని కొట్టక్కి బస్సు షెల్టర్ సమీపాన గురువారంరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు దుర్మరణం చెందారు. ఎదురెదురుగా వస్తున్న రెండు బైకులు బలంగా ఢీకొనడంతో అక్కడికక్కడే ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో సాలూరు పట్టణంలోని గొల్లవీధికి చెందిన గొంటుబోయన యశోద కృష్ణ (22), గొట్టేడ శ్రీను (45), రామభద్రపురం మండలం జన్నివలసకు చెందిన జొన్నాడ పురుషోత్తం (26) ఉన్నారు. తీవ్రంగా గాయపడిన జన్నివలసకు చెందిన జి.రామప్రసాద్, జి.శరత్‌గణేష్‌కు సాలూరు ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు.



సంఘటనా స్థలంలో మృతి చెందిన పురుషోత్తం (ఇన్‌సెట్‌లో)



ప్రమాదంలో మృతి చెందిన శ్రీను, యశోద కృష్ణ; గాయపడిన రాంప్రసాద్

## బంగారునాయుడుకు పతంజలి పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరంకోట



ప్రముఖ రచయిత, సీనియర్ సంపాదకులు కెఎన్‌వై పతంజలి జయంతి సందర్భంగా ఏటా అందజేసే రాష్ట్ర స్థాయి పురస్కారానికి ఈ ఏడాది పార్వతీపురానికి చెందిన రచయిత రౌతు బంగారు నాయుడును ఎంపిక చేసినట్లు కెఎన్‌వై పతంజలి సాంస్కతిక వేదిక అధ్యక్ష, కార్యదర్శులు భీశెట్టి బాబ్జి, ఎన్. కె.బాబు ప్రకటించారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ పతంజలి జయంతి సందర్భవంగా మే 17న ఈ పురస్కారాన్ని ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. బంగారునాయుడు సువర్ణముఖి కథా సంకలనంతో తెలుగు సాహిత్యంలో ప్రాచుర్యం పొందారని, ప్రస్తుతం పలు న్యూస్ ఛానల్స్‌కు కంటెంట్ రైటర్‌గా పని చేస్తున్నారని తెలిపారు. పతంజలి లానే రచనలతో పాటు వర్తమాన రాజకీయాలపై కొంటె కోణంలో వ్యంగ్యాస్త్రాలను తన కలం ద్వారా సంధించే చెయ్యి తిరిగిన రచయిత అన్నారు. బంగారు నాయుడు పేరును పురస్కార ఎంపిక కమిటీ సభ్యులైన సాహితీకారులు ఎన్.కె.బాబు, పాత్రికేయులు విఎమ్‌కె లక్ష్మణరావు, భళ్లమూడి నాగేంద్ర ప్రసాద్ ఎంపిక చేశారన్నారు. సమావేశంలో సంస్థ ప్రతినిధులు పిడకల ప్రభాకరరావు, జలంత్రి రామచంద్ర రాజు,తాడేపల్లి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ఛాంబర్ ఆఫ్‌కామర్స్ రూ.61 లక్షలు ఆస్తి పన్ను చెల్లింపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు దీర్ఘకాలికంగా బకాయి ఉన్న ఆర్యవైశ్య అసోసియేషన్ భవన ఆస్తి పన్ను ఏకమొత్తంలో చెల్లించి వడ్డీ మాఫీని పొందారు. వాస్తవంగా భవన ఆస్తి పన్ను మొత్తం కోటి 64 లక్షల 18,899 రూపాయలు కాగా, వడ్డీ మాఫీ రూపేనా కేవలం 61 లక్షల 17,239 రూపాయలు చెల్లించారు. కోటీ 3 లక్షల 1,660 రూపాయలు రాయితీ లబ్ధి పొందినట్లు ఛాంబర్ ప్రతినిధులు తెలిపారు. ఈమేరకు పన్ను విలువ మొత్తాన్ని చెక్కు రూపంలో కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడుకు ఛాంబర్ ఆఫ్ కామర్స్ నాయకులు కేదారిశెట్టి సీతారామమూర్తి, రవ్వ శ్రీనివాస్, ఎంసిహెచ్‌గుప్తా, కాపుగంటి ప్రకాష్ అందజేశారు. ఆస్తిపన్ను, ఖాళీ స్థలాల పన్నులపై ప్రభుత్వం ఇచ్చిన వడ్డీ రాయితీ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడం అభినందనీయమని కమిషనర్ అన్నారు.

## తిత్లీ నిధులు కాదు... సర్దుబాటే!


ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

తిత్లీ తుపాను బాధితుల కోసం రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఎటువంటి నిధులను విడుదల చేయలేదు. కేవలం గతంలో చేసిన ఖర్చులకు సంబంధించి అంతర్గత సర్దుబాటు మాత్రమే చేసింది. ఈ నెల 26న రెవెన్యూ డిపార్ట్‌మెంటు జారీ చేసిన మెమోలో ఈ విషయాన్ని పేర్కొన్నారు. 2018 అక్టోబర్ నెలలో ఉత్తరాంధ్రను తిత్లీ తుపాను వణికించిన సంగతి తెలిసిందే. ఆ సందర్భంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లా కలెక్టర్లు తమ వద్ద ఉన్న నిధుల నుండి సుమారుగా 530 కోట్ల రూపాయలను బాధితులను ఆదుకునేందుకు విపత్తుల నివారణ శాఖకు మళ్లించారు. ఈ మొత్తాన్ని తిరిగి తమకు ఇవ్వాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని గతంలోనే కోరారు. తాజాగా అప్పట్లో ఖర్చు చేసిన మొత్తాన్ని సుమారు 514 కోట్ల రూపాయలుగా గుర్తించి, ఆ మేరకు సర్దుబాటు చేస్తున్నట్లు రెవెన్యూ శాఖ తెలిపింది. తిత్లీ బాధిత రైతులు సుమారు 6,700 మంది నష్టపరిహారం కోసం ఇంకా అధికారులు చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

## న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా హరీష్

ప్రజాశక్తి-విజయ నగరం లీగల్

స్థానిక న్యాయ వాదుల సంఘం నూతన కార్యవర్గ ఎన్నికల్లో అధ్యక్షుడిగా అల్లాడ హరీష్ ఎన్నికయ్యారు. గురువారం న్యాయ వాదుల సంఘం ఎన్నికలు జరిగాయి. ఈ సంఘం లో మొత్తం 549 మంది సభ్యత్వం కలిగి ఉండగా, 473 మంది ఓటు హక్కు వినియోగించు కున్నారు. అధ్యక్ష పదవికి పోటీలో నిలిచిన అల్లాడ హరీష్‌కు 281 ఓట్లు రాగా ప్రత్యర్థులు కంటు భుక్త శ్రీనివాసరావు కు 172 ఓట్లు , సరిపల్లి నాగేశ్వరరావుకు 8 ఓట్లు వచ్చాయి. 109 ఓట్ల మెజార్టీతో హరీష్ గెలుపొందారు. ఉపాధ్యక్షుడిగా దాసరి ఈశ్వర రావు, సంయుక్త కార్యదర్శిగా ఎర్రసూరి పైడి వెంకట రమణ మూర్తి, కోశాధికారిగా బీంపల్లి రవి గెలుపొందారు. ఎన్నికల అధికారులుగా పెంట శ్రీరామ మూర్తి , కలిశె ట్టి రవిబాబు, ఎవిఎల్ పద్మజ ధ్రువీకరిస్తూ పత్రం అందజేశారు. గెలుపొందిన నూతన కార్యవర్గ సభ్యులను మాజీ అధ్యక్షుడు సిహెచ్ దామోదర రామమోహనరావుతో న్యాయ వాదులు అభినందించారు.



ఎన్నికైన నూతన్య కార్యవర్గ సభ్యులు

## వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలి

### టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

యువతకు అన్ని విధాలా మోసం చేసిన వైసిపి ప్రభుత్వాన్ని ఇంటికి పంపాలని విజయనగరం నియోజకవర్గ టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థి పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు అన్నారు. విజయనగరం నియోజకవర్గం తెలుగు యువత సమావేశం గురువారం అశోక్‌బంగ్లాలో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలలో యువత కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. రాష్ట్రంలో గత ఐదేళ్లుగా జరిగిన విధ్వంసాన్ని అందరు చూసారన్నారు, దేశ భవిష్యత్తు అయిన యువతను అన్ని విధాలుగా మోసం చేసిన జగన్ ప్రభుత్వాన్ని ఇంటికి పంపించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధి లేక నిరుద్యోగం పెరిగి, నిరుత్సాహానికి గురైన యువత డ్రగ్స్ కు బానిసలవుతున్నారని విమర్శించారు. డ్రగ్స్ గ్రామాలలో కూడా విచ్చలవిడిగా దొరికే స్థితికి తీసుకువచ్చిన ఘనత జగన్ ప్రభుత్వానిదేనని, అందుకు ఉదాహరణే ఇటీవల విశాఖపట్నంలో దొరికిన 25వేల కిలోల డ్రగ్స్ అని అన్నారు. ఏటా జాబ్ కాలెండర్ విడుదల చేస్తానని చెప్పి వారిని మోసం చేశారన్నారు. రాష్ట్రాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసే చంద్రబాబు నాయకత్వాన్ని బలపర్చి తనను గెలిపించాలని కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతి

**ఘన విజయం సాధిస్తాం**

రానున్న ఎన్నికల్లో టిడిపి, జనసేన కూటమి ఘన విజయం సాధిస్తుందని అదితి గజపతి అన్నారు. విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రజలు ఈ ప్రభుత్వ పాలన నుంచి విసిగిపోయి ఉన్నారన్నారు ఒకపక్క విద్యార్థులకు నిరుద్యోగులకు ఉద్యోగాలు లేక మరోపక్క ఉన్న ఫ్యాక్టరీలు మూతపడి నిరుద్యోగులు ఎక్కువగా తయారయ్యారని తెలిపారు. టిడిపి ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాల పట్ల ప్రజలు ఆకర్షితులవు తున్నారని తెలిపారు.

**టిడిపి ఆవిర్భావ వేడుకలు జయప్రదం చేయండి**

అశోక్ బంగ్లాలో శుక్రవారం జరిగే పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు కోరారు. ఉదయం 9 గంటలకు అశోక్ బంగ్లాలో పార్టీ జెండాను పొలిట్ బ్యూరోసభ్యులు పూసపాటి అశోక్ గజపతి రాజు ఎగుర వేస్తారన్నారు. నాయకులు పిల్ల విజయ కుమార్ పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, బంగారు బాబు గంటా పోలినాయుడు, కనకల మురళీమోహన్, విజ్జపు ప్రసాద్, కంది మురళి నాయుడు పాల్గొన్నారు.

## సంక్షేమ పాలనే గెలిపిస్తుంది

### డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేసిన సంక్షేమ పాలన, స్థానికంగా తాము చేసిన నగరాభివృద్ధే తమ విజయానికి సోపానాలుగా నిలవనున్నాయని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. గురువారం జమ్ము ప్రాంతంలో జరిగిన ఇంటింటి ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. కొంతమంది తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు అభిమానులు కోలగట్ల సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే వారిని ప్రజలు ఎన్నుకోవాలని, ఎన్నికల అప్పుడే కనిపించే నాయకులను దూరంగా పెట్టాలని అన్నారు. టిడిపి నాయకులు లేనిపోని ఆరోపణలు చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారన్నారు. అయితే తమపై ఎన్ని ఆరోపణలు చేసిన రుజువు చేయలేరని, తాము ధైర్యంగా ప్రజల వద్దకు వెళుతున్నామని అన్నారు. గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో గుర్తించిన అభివద్ధి పనులను పూర్తి చేసామన్నారు.కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, రాష్ట్ర పరిశ్రమల అభివద్ధి మండలి డైరెక్టర్ బంగారనాయుడు, స్థానిక కార్పొరేటర్ ఆల్తి సత్యకుమారి, ఎఎంసి చైర్మన్ నడిపేన శశి భార్గవి, జోనల్ ఇన్చార్జిలు బొద్దాన అప్పారావు, రెడ్డి గురుమూర్తి,బోడసంగి ఈశ్వర రావు, పొంతపల్లి గోపి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న వైసిపి అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి


పోలింగ్ అధికారులతో మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి సాయిశ్రీ

## పోలింగ్ రోజు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

పోలింగ్ రోజు ఎన్నికల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ ఎ. సాయిశ్రీ కోరారు. స్థానిక గురుకుల పాఠశాలలో గురువారం పోలింగ్ అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికలు విజయవంతం చేయాల్సిన బాధ్యత ఎన్నికల అధికారులపై ఉందన్నారు. పోలింగ్ రోజున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఒకరి ఓటు మరొకరు వేయకుండా చూడాలన్నారు. ఛాలెంజ్ ఓట్లకు అనుమతి ఇవ్వాలన్నారు. ఇవిఎంలు పని విధానం, ఎలా కనెక్షన్ ఇవ్వాలో అవగాహన పెంచుకోవాలన్నారు. ఎటువంటి అనుమానాలు ఉన్న శిక్షణలో నివృత్తి చేసుకోవాలని కోరారు. ఎన్నికల అధికారులకు మాస్టర్ ట్రైనీలు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో బొబ్బిలి, రామభద్రపురం మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన కమిషనర్**

మున్సిపాలిటీలోని పాతబొబ్బిలి, మల్లమ్మపేట, టీఆర్ కాలనీ, ఐబిఐ కాలనీలో మున్సిపల్ పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను గురువారం మున్సిపల్ కమిషనర్ ఎల్.రామలక్ష్మి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలలో ఉన్న వసతులను పరిశీలించారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సౌకర్యాలు ఏర్పాటు చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్, ఏఇ సురేష్‌ను ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఏర్పాట్లు కోసం త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కోరారు.


కొండను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

## రాళ్ల కొండలపై అధికారుల దాడులు

**'ప్రజాశక్తి' కథనానికి స్పందన**

ప్రజాశక్తి - రేగిడి

మండలంలోని కోడిశ తాటిపాడు, కొండవలస, పెద్ద శిర్లాం గ్రామాల్లో ఉన్న రాళ్ల కొండలపై రెవెన్యూ అధికారులు గురువారం దాడులు జరిపారు. ఈ నెల 26న ప్రజాశక్తిలో కొండను కొల్లగొట్టేశారు అనే వార్త కథనానికి జిల్లా అధికారులు స్పందించి తహశీల్దార్‌కు దాడులు జరపాలని ఆదేశించారు. దీంతో ఆర్ఐ రేవతి, సర్వేయర్ మహేశ్వరరావు ఆయా గ్రామాల రాళ్ల కొండలపై దాడులు నిర్వహించారు. ఎన్నో ఏళ్ల నుంచి ఈ గ్రామాల్లో ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా కొండను డ్రిల్లింగ్ చేసి స్టోన్ క్రషింగులకు, ఇతర ప్రాంతాలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నట్లు గుర్తించారు. ఈ తవ్వకాల్లో ఎటువంటి అనుమతులు లేవని గుర్తించినప్పటికీ, గ్రానైట్ కొండ తవ్వకాల నిర్వాహకులు తమ వద్ద రికార్డులు ఉన్నాయని చెప్పడం కొసమెరుపు అని అధికారులు చెబుతున్నారు. ఏది ఏమైనా రికార్డులు, ఎన్ఓసి, అనుమతులు వంటివి తనిఖీలు, పరిశీలన చేశాకే తవ్వకాలు చేపట్టాలని నిర్వాహకులకు రెవెన్యూ అధికారులు తెలిపారు.

## తూతూ మంత్రంగా మండల సమావేశం

ప్రజాశక్తి - కొత్తవలస

స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన తూతూ మంత్రంగా నిర్వహించారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తూ ఎటువంటి చర్చ తీర్మానాలూ లేకుండానే సమావేశం ముగించారు. ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ మాట్లాడుతూ ప్రస్తుతం ఎన్నికల నిబంధనలు ఉన్నందున సభలో ఎటువంటి కొత్త తీర్మానాలు చేయకూడదనే నిబంధనతో తీర్మానాలు స్వీకరించలేదన్నారు. మండలంలో తాగునీటి సమస్యకు రూ.9లక్షలు నిధులు వెచ్చిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఇఒపిఆర్‌డి కర్రీ ధర్మారావు, విద్యుత్ శాఖ ఎఇ ఉపాధి హామీ, వెలుగు, వెటర్నటీ, విద్యాశాఖ అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఫిజియోథెరపీ

ప్రజాశక్తి - రేగిడి


ఫిజియోథెరిపీ చేస్తున్న డాక్టర్

వికలాంగ విద్యార్థులకు ఫిజియోథెరపీతోనే శారీరక అవయవాలు నయమవుతాయని ఆర్థోపెటిక్ వైద్యులు రమా చంద్రిక అన్నారు. గురువారం స్థానిక భవిత కార్యాలయంలో నిర్వహించిన వికలాంగు విద్యార్థుల ఫిజియోథెరపీని ఎంఇఒ ఎం వరప్రసాదరావు, ఎరకయ్యలు పరిశీలించారు. వికలాంగ విద్యార్థులు ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీరితో ఐఇఆర్ ఉపాధ్యాయులు మహేశ్వరి, పి రాజేష్, కేర్ టేకర్ అనురాధ ఉన్నారు.


## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు

ప్రజాశక్తి - తెర్లాం

మండలంలోని పెరుమాలి ఎపి మోడల్ కాలేజ్ మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేశామని పాఠశాల ప్రిన్సిపాల్ జి జ్యోతిలక్ష్మి తెలిపారు. ఈనెల 28 నుండి మే 22వ తారీకు వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఒసి, బిసి విద్యార్థులకు రూ.200, ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థులకు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

## మాజీమంత్రిని ఓటు అడిగిన బేబినాయన

ప్రజాశక్తి - బొబ్బిలి


మాజీ మంత్రితో మాట్లాడుతున్న బేబినాయన

మాజీ అటవీ శాఖ మంత్రి పెద్దింటి జగన్మోహనరావును టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి అభ్యర్థి బేబినాయన తనకు ఓటు వేయాలని అభ్యర్థించారు. స్థానిక 28వ వార్డులో గురువారం బేబినాయన ఎన్నికల ప్రచారం చేశారు. ఇందులో భాగంగా మాజీమంత్రి పెద్దింటి జగన్మోహనరావును ఆయన ఇంటిలో బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి కలిసి మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 1999లో జరిగిన ఎన్నికల్లో మాజీ మంత్రి పెద్దింటి గెలుపునకు బేబినాయన కష్టపడి పని చేశారు. రానున్న ఎన్నికల్లో బేబినాయన గెలుపునకు పని చేసి రుణం తీర్చుకోవాలని పెద్దింటిని టిడిపి కార్యకర్తలు కోరారు.

**టిడిపిలో చేరిన మాజీ కౌన్సిలర్**

మాజీ కౌన్సిలర్ రేవళ్ల సత్యవతి వైసిపిని వీడి టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. గతంలో బేబినాయన మున్సిపల్ చైర్మన్‌గా పని చేసిన ప్యానల్లో సత్యవతి కౌన్సిలర్‌గా పని చేశారు. 2019 ఎన్నికల్లో వైసిపికి మద్దతుగా పని చేశారు. బేబినాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు రాజా, జనసేన నియోజకవర్గ ఇంచార్జి గిరడ అప్పలస్వామి సమక్షంలో ఆమె గురువారం టిడిపిలో చేరారు.

**గజపతినగరం:** పట్టణంలోని కుమ్మర వీధికి చెందిన వార్డు మెంబరు యడ్ల లక్ష్మి, గోపి దంపతులు గురు వారం టిడిపి తీర్థం పుచ్చుకున్నారు. వార్డు సభ్యులుగా ఎన్నికైన నాటి నుంచి ఏ పార్టీకి వెళ్లకుండా తటస్థంగా ఉంటున్న గోపి తన సతీమణి లక్ష్మీతో కలిసి కూటమి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాస్ సమ క్షంలో ఆ పార్టీలో చేరారు. గోపి ఆధ్వర్యంలో కుమ్మర వీధితో పాటు పలు వార్డులకు చెందిన ముఖ్య నాయ కులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో టిడిపిలో చేరారు.

# సామాజిక బాధ్యతతో సేవలందించా

## ఎల్ఐసి యూనియన్ నాయకులు ఎం.శ్రీనివాస


ప్రజాశక్తి-విజయనగరం టౌన్

**తన 39ఏళ్ల ఉద్యోగ జీవితంలో సామాజిక బాధ్యతగా భావించి సేవలు అందించానని ఎల్ఐసి విజయనగరం బ్రాంచ్ లో అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించిన మంగిపూడి శ్రీనివాస తెలిపారు. ఈనెల 28న ఉద్యోగ విరమణ చేసిన సందర్భంగా ప్రజాశక్తికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన తన ఉద్యోగ జీవితం గురించి వివరించారు.**

తల్లితండ్రులు మంగిపూడి కామేశ్వరి, సూర్యనారాయణ మూర్తి. నాకు నలుగురు అక్క చెల్లెళ్లు. తండ్రి స్వస్థలం విశాఖ జిల్లా చోడవరం. మా అమ్మగారి స్వస్థలం విజయనగరం. భార్య శశికళ పూసపాటిరేగ మండలం రెల్లివలస జెడ్‌పి హైస్కూల్‌లో ఉపాధ్యాయునిగా ప్రస్తుతం పనిచేస్తున్నారు. ఇద్దరు పిల్లలు, కుమారుడు శరత్ చంద్ర బెంగుళూరులో పిడబ్ల్యుసి సంస్థలో సీనియర్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్నారు. కుమార్తె సింధూర ఢిల్లీ లోని మహిళా హార్డింగ్ మెడికల్ కాలేజీలో ఎమ్‌డి చేస్తోంది.

ఒరిస్సా రాష్ట్రంలోని ఇబ్ అనే గ్రామంలో 1964 మార్చి 28న జన్మించాను. తండ్రి రైల్వేలో పనిచేసేవారు. తల్లి గృహిణి. తండ్రి రైల్వేలో పని చేయడం వలన 5వ తరగతి వరకు విద్యాభ్యాసం ఇంటి దగ్గరే జరిగింది. హైస్కూల్ విద్యను విజయనగరం బిపిఎం హైస్కూల్, ఇంటర్, డిగ్రీ ఎంఆర్ డిగ్రీ కాలేజీలో చదివాను. ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ చేస్తుండగా ఎల్ఐసిలో అసిస్టెంట్‌గా ఉద్యోగ వచ్చింది. 1985 మే 1న ఉద్యోగంలో చేరాను. 3 నెలలు ట్రైనింగ్ అనంతరం 1985 ఆగష్టు 1న ప్రొబిషనరీ అసిస్టెంట్‌గా పలాసలో జాయిన్ అయ్యాను. అక్కడ పనిచేస్తుండగా పలాస ఎల్ఐసి బేస్ యూనిట్ కార్యదర్శిగా ఎన్నికయ్యాను. కార్యదర్శిగా చేస్తూనే ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ కో ఆర్డినేటర్ కమిటీ కన్వీనర్‌గా పని చేశాను. 1986 డిసెంబర్ 2 న విజయనగరం బ్రాంచ్‌కు బదిలీపై వచ్చాను. నా 38సంవత్సరాల 10 నెలలు సర్వీస్ లో 37ఏళ్ల 3 నెలలు విజయనగరం బ్రాంచ్ లోనే సర్వీస్ పూర్తి చేశాను. విజయనగరం బ్రాంచ్‌లో యూనిట్ కార్యదర్శిగా, విశాఖ డివిజన్ ఉపాధ్యక్షులుగా, ఎస్‌సిజెడ్ఐఇఎఫ్ జోనల్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా బాధ్యతలు చేపట్టాను. ఈ క్రమంలోనే ప్రభుత్వ రంగ పరిరక్షణ, ప్రజాతంత్ర ఉద్యమాలకు ఆకర్షితుడినై సమ సమాజ స్థాపన ధ్యేయంగా కృషి చేశాను.

విజయనగరం జిల్లా సిఐటియు ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వహించాను. సిఐటియు అఖిల భారత కౌన్సిల్ సభ్యులుగా కూడా ఉన్నాను. ఉమ్మడి రాష్ట్రంలో జ్యూట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహించాను. ప్రస్తుతం సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నాను. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్నాను. సిఐటియు ప్రధాన బాధ్యతలో ఉన్నప్పుడు ఫేకర్, జ్యూట్, వెరా లేబొరేటరీస్, భీమసింగి షుగర్స్ తదితర కంపెనీల్లోను, షాప్ ఎంప్లాయిస్, అంగన్వాడీ, మున్సిపల్, ఎలక్ట్రిసిటీ తదితర రంగాలలో యూనియన్‌లు ఏర్పాటు కావడంలో ముఖ్యభూమికను పోషించాను. ఈ యూనియన్‌లు చేపట్టిన ముఖ్యమైన పోరాటాల్లో కీలకమైన బాధ్యతలు వహించడం మరచిపోలేనిది. తల్లిదండ్రుల ఆశీస్సులు, కుటుంబ సభ్యులు, తోటి ఉద్యోగుల సహాయ సహకారాలు, ఎఐఐఇఎ నాయకుల మార్గనిర్దేశంతో ఎల్ఐసిలో 39 సంవత్సరాల సర్వీసును విజయవంతంగా పూర్తి చేసుకుని రిటైర్డు అయ్యాను. వీరందరి సహకారంతోనే ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం, నమ్మిన సిద్ధాంతం కోసం పనిచేసి ప్రజా ఉద్యమాల్లో పాల్గొనడం ఆనందంగా ఉంది. ఇదంతా సామాజిక బాధ్యతగానే చేపట్టాను. ఉద్యోగ జీవితంలో సహకారం అందించిన ఉద్యోగులకు, కార్మిక రంగ ఉద్యమాల్లో సహకరిస్తున్న ప్రజా సంఘాలు, సిపిఎం నాయకులకు, నాకు అన్ని విధాలుగా అండగా ఉన్న కుటుంబ సభ్యులకు అభినందనలు. ఉద్యోగ విరమణ అనంతరం సామాజిక బాధ్యతగా ప్రజలకు సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తాను.

## గిరిజన మహిళకు అవమానం బాధాకరం

ప్రజాశక్తి - బాడంగి

ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్నప్పల నాయుడు బొబ్బిలి నియోజకవర్గంలోని దొమ్మూర వలసలో ఇంటింటి ప్రచారం కార్యక్రమంలో భాగంగా ఒక ఎస్‌టి గిరిజన మహిళను ఉద్దేశించి అవమానకరంగా మాట్లాడటం బాధాకరమని టిడిపి రాష్ట్ర ఎస్‌టి జనరల్ సెక్రటరీ, ఎంపిటిసి పాలవలస గౌరు అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కనీసం మహిళలను గౌరవించడపోగా గతంలో గిరిజన మహిళలకు జాకెట్టు ఉండేవి కాదు.. ఇప్పుడు ఉంటున్నాయంటే వైసిపి అభివృద్ధి చేసింది కదా అని అవమానించడం సిగ్గుచేటన్నారు. గిరిజన జాతులను, మహిళలను అవమానించారని, దీనికి ఎమ్మెల్యే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హెచ్చరించారు.

## బడ్జెట్ ప్రణాళిక సక్రమంగా నిర్వహించాలి

**శృంగవరపుకోట:** మొట్టమొదటి గ్రామసభ బడ్జెట్ ప్రణాళికను సక్రమంగా నిర్వహించాలని ఓటరు అక్షరాస్యత వేదిక వ్యవస్థాపకులు దొడ్డి సూర్యారావు అన్నారు. పట్టణంలోని ఒక ప్రైవేటు హాల్లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2024- 25 సంవత్సరానికి గాను రాజ్యాంగబద్ధ మొట్టమొదటి గ్రామసభ బడ్జెట్ ప్రణాళిక పేరుతో వచ్చే నెల ఏప్రిల్ 14 నుంచి రాష్ట్రంలో ఉన్న 13371 గ్రామపంచాయతీలలో జరగనున్నాయని వీటిని సక్రమంగా నిర్వహించాలని కోరారు. ఈ మేరకు రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కన్నబాబుకు, జిల్లా పంచాయితీ అధికారి శ్రీధర్ రాజుకు ఇప్పటివరకు జరిగిన గ్రామసభల నిర్వహణలో లోపాలను తెలియజేస్తూ లేఖలు పంపించామన్నారు. ఈ సమావేశంలో వేదిక ప్రతినిధులు ఎల్ సాంబమూర్తి, సిహెచ్ రామకృష్ణ, ఆర్ సూరిదేముడు, ఎం అప్పారావు, పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారంలో కాలయాపన తగదు

ప్రజాశక్తి - నెల్లిమర్ల


మాట్లాడుతున్న మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ నాయకులు రమణ

మిమ్స్ ఉద్యోగులు, కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కారంలో కాలయాపన తగదని మిమ్స్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు టివి. రమణ అన్నారు. గురువారం స్థానిక ఆర్ఒబి వద్ద మిమ్స్ ఉద్యోగులు, కార్మికులు న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని చేస్తున్న నిరశన పోరాటం 57వ రోజుకి చేరింది. ఈ సందర్భంగా టివి రమణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ శిబిరంలో మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులు 7డిఎ బకాయిలు చెల్లించాలని, 2019 నుంచి వేతన ఒప్పందం చేయాలని, వేధింపులు, బదిలీలు ఆపాలని కాంట్రాక్టు కార్మికులను రెగ్యులర్ చేయాలని, సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి తీసుకోవాలని 57రోజులుగా నిరశన పోరాటం చేస్తుంటే యాజమాన్యం చర్చల పేరిట కాలయాపన చేయడం తగదన్నారు. గురువారం జరిగిన చర్చల్లో మిమ్స్ యాజమాన్యం 7శాతం డిఎ ఇవ్వడానికి అంగీకారం తెలిపి, వేతన ఒప్పందం కొత్త నిబంధనల ప్రకారం చేస్తామని అది కూడా ఏప్రిల్ నెల నుంచి ఇస్తూ ఆగస్టులో అగ్రిమెంట్ చేస్తానని చెప్పడం భావ్యం కాదన్నారు. ముందు వేతన ఒప్పందం అగ్రిమెంట్ చేయాలని కొత్త వేతన ఒప్పందం ప్రకారం పెరిగిన వేతనాలు ఆగస్టు నుంచి అమలు చేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు చేసిన నిరశన పోరాట కాలంలో వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సస్పెండ్ చేసిన ఉద్యోగులను విధుల్లోకి యాజమాన్యం తీసుకుంటామని చెప్పినట్లు తెలిపారు. ఈ చర్చలు గురువారంతోపాటు శుక్రవారం కూడా కొనసాగుతాయన్నారు. ఈ శిబిరంలో మిమ్స్ ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎం.నారాయణ, ఉద్యోగులు కె. కామునాయుడు, కె.మధు, ఎం.నాగభూషణం, గౌరీ, వరలక్ష్మి, బి. బంగారునాయుడు మూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## పిఎఫ్ బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి - బొబ్బిలి

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ కార్మికులకు పిఎఫ్ బకాయిలు చెల్లించకపోవడంతో కార్మికులకు పిఎఫ్ పెన్షన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే మూతపడిన జ్యూట్ పరిశ్రమలు తెరిపిస్తామని సీఎం జగన్మోహన్ రెడ్డి హామీ ఇచ్చినప్పటికీ 2019లో అధికారం చేపట్టిన తర్వాత వైసిపి ఎమ్మెల్యే సమక్షంలో జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మివేయడం చూస్తే కార్మికులు పట్ల ప్రభుత్వ వైఖరిని అర్థం చేసుకోవచ్చునన్నారు. 2020 ఫిబ్రవరి నాటికి కార్మిలందరికి పిఎఫ్ బకాయిలు చెల్లిస్తామని ఎమ్మెల్యే సమక్షంలో ఒప్పందం జరిగినా ఇప్పటికీ బకాయిలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. 1200మంది కార్మికులకు రూ. 1.63కోట్లు పిఎఫ్ సొమ్ము చెల్లించలేదన్నారు. వీరిలో 312 మంది కార్మికులకు 55ఏళ్లు నిండడంతో పెన్షన్ రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వందలాది మంది కార్మికులు అనారోగ్యంతో మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జ్యూట్ కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు జ్యూట్ కార్మికుల పిఎఫ్ బకాయి చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామన్నారు. విలేకరుల సమావేశంలో సిఐటియు నాయకులు ఎస్.గోపాలం, బి.యుగంధర్, బి.గోపాల్ ఉన్నారు.

## పాత క్వారీలో పనులు నిలిపివేత

- అక్కడ నుంచి వాహనాలు తరలింపు
- క్వారీ పనులు అడ్డుకుంటున్నారని జిఎంఆర్ సంస్థ ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం


గ్రామస్తుల నిరసనతో పాత క్వారీలో నిలిచిపోయిన పనులు

మండలంలోని రామచంద్రపేట గ్రామస్తుల నిరసనతో ఎట్టకేలకు క్వారీ పనులను నిర్వాహకులు నిలిపివేశారు. క్వారీలో ఉన్న పొక్లైన్లు, డ్రిల్లింగ్ చేసే యంత్రాలను నిర్వాహకులు క్వారీలో నుంచి బయటకు తరలించేశారు. గత మూడు రోజుల నుంచి క్వారీ పనులను నిలిపివేయాలని గ్రామస్తులంతా ఏకమై నిరసన తెలియజేసిన విషయం తెలిసిందే. క్వారీ నిర్వాహకుడు అనీల్‌ను కూడా అడ్డుకొని పనులను నిలిపివేయాలని నిలదీయడంతో గురువారం నుంచి క్వారీ పనులు నిలిపివేశారు.

**గ్రామ పెద్దలతో చర్చించిన సిఐ**

గ్రామంలోని పాఠశాల వెనుక భాగంలో ఇటీవల విమానాశ్రయ నిర్మాణ సంస్థ జిఎంఆర్ క్వారీ పనులు చేస్తుండడంతో గ్రామస్తులు మూడు రోజులు కింద అడ్డుకున్న విషయం తెలిసిందే. దీంతో భోగాపురం సిఐ ఏ రవికుమార్ గ్రామ పెద్దలను బుధవారం సాయంత్రం పిలిపించి మాట్లాడారు. అనుమతులు పొంది క్వారీ పనులు చేస్తుంటే ఎందుకు అడ్డుకుంటున్నారని సిఐ వారిని ప్రశ్నించారు. ఉన్నవాటితో ఇబ్బంది పడుతున్నామని మళ్లీ ఇప్పుడు కొత్తగా క్వారీ ఏర్పాటు చేస్తే చాలా ఇబ్బందులకు గురవుతామని గ్రామ పెద్దలు సిఐకి తెలిపారు.

**అడ్డుకుంటే చర్యలు తీసుకుంటాం: సిఐ**

ప్రభుత్వం అధికారికంగా అనుమతులు మంజూరు చేసినప్పటికీ గ్రామస్తులు అడ్డుకుంటున్నట్లు జిఎంఆర్ సంస్థ ఫిర్యాదు చేసింది. వారికి మంజూరు చేసిన అనుమతులు పరిశీలించి గ్రామస్తులతో చర్చించడం జరిగింది. ఏమైనా ఇబ్బంది ఉంటే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసుకోవాలి. కానీ పనులను అడ్డుకుంటే వారిపై కచ్చితంగా కేసులు నమోదు చేస్తాం.

**ఎ. రవికుమార్, సిఐ, భోగాపురం**

## జాతీయ క్రీడలకు విద్యార్థి కిరణ్‌కుమార్ ఎంపిక

ప్రజాశక్తి - గరివిడి

స్థానిక ఎస్‌డిఎస్ కళాశాలకు చెందిన బిఎస్‌సి కంప్యూటర్ సైన్స్ ప్రథమ సంవత్సరం విద్యార్థి ఆల్తి కిరణ్ కుమార్ జాతీయ స్థాయిలో రూప్ స్కిప్పింగ్ విభాగంలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తరుపున ఎంపికయ్యాడు. ఈ విద్యార్థి ఏప్రిల్ రెండో తేదీన ఎల్ఎన్‌సిటీ విశ్వవిద్యాలయం భోపాల్ మహారాష్ట్రలో జరగనున్న జాతీయ క్రీడల్లో పాలుపంచుకొని బంగారు పతకం సాధించాలని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ టీ కమలాకర్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ బి శ్రీను, కళాశాల ప్రిన్సిపాల్ బి రవి పాల్గొన్నారు.

## అరుదైన రక్తాన్ని దానం చేసిన జవాన్

ప్రజాశక్తి - నెల్లిమర్ల



రక్తదానం చేస్తున్న మద్దిల సంతోష్ కుమార్

అరుదైన రక్తం వర్గం బి నెగిటివ్‌ను జరజాపు పేటకు చెందిన సిఆర్‌పిఎఫ్ జవాన్ మద్దిల సంతోష్ కుమార్ గురువారం దానం చేశారు. విజయనగరం గాయత్రి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న బి.చంద్రకళకు అత్యవసర పరిస్థితుల్లో అరుదైన రక్త వర్గం బి నెగిటివ్ అవసరం కావడంతో గత కొద్ది రోజులుగా పేషెంట్ బంధువులు రక్త దాత కోసం వెతుకుతున్నారు. ఈ క్రమంలో బ్లడ్ బ్యాంక్ వారు సాధన యువజన సంఘం అధ్యక్షుడు పోలుబోతు దుర్గాప్రసాద్‌ను సంప్రదించారు. దుర్గా ప్రసాద్ వెంటనే స్పందించి సాధన సభ్యుల జాబితాలో బి నెగిటివ్ రక్త వర్గానికి చెందిన మద్దిల సంతోష్ కుమార్‌కి సమాచారమిచ్చారు. సంతోష్ కుమార్ విధులను ముగించుకుని విశాఖపట్నంలో ఛత్రపతి శివాజీ బ్లడ్ బ్యాంక్‌లో రక్త దానం చేశారు. కాగా రక్త దాత ఉద్యోగరీత్యా వైజాగ్ లో ఉంటున్న తరుణంలో సమయాభావంతో విశాఖపట్నంలో రక్తదానం చేశారు. పేషెంట్ బంధువులకు సకాలంలో రక్తం అందేలా ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ రవాణా సహకరం చేశారు. రక్త దాత అత్యవసర పరిస్థితుల్లో స్పందిస్తూ నేటికీ 33 సార్లు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా రక్త దాత సంతోష్ కుమార్‌ని సాధన యువజన సంఘం బృందం, ఎన్‌విఎన్ బ్లడ్ బ్యాంక్ నాగేశ్వర రావు, సిబ్బంది వినయ్, సాయి కుమార్, పేషెంట్ బంధువులు ప్రశంసించారు. ఈ సందర్భంగా రక్తదాత మద్దిల సంతోష్ కుమార్‌ను బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు సత్కరించి అభినందించారు.

## న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా సూరిదేముడు

ప్రజాశక్తి - శృంగవరపుకోట


ఎస్‌కోట: నూతనంగా ఎన్నికైన కార్యవర్గం

ఎస్‌కోట న్యాయవాదుల సంఘ అధ్యక్షుడిగా జి.సూరిదేముడు ఎన్నికయ్యారు. గురువారం జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో మండా కామేశ్వరరావుపై జి.సూరిదేముడు 24ఓట్ల మెజార్టీతో గెలుపొందినట్టు ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్, సహాయ ఎన్నికల అధికారి బొబ్బిలి రామకృష్ణ వెల్లడించారు. న్యాయవాదుల సంఘంలో రిజిస్ట్రేషన్ అయిన 45 మందికి గాను ఓటింగ్‌లో 42 మంది పాల్గొనగా ఇందులో జి.సూరిదేముడుకి 33 ఓట్లు, మండా కామేశ్వరరావుకి 9 ఓట్లు పోలయ్యాయి. కార్యదర్శిగా బి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడిగా ఎం.అప్పారావు, సంయుక్త కార్యదర్శిగా ఎల్.అప్పారావు, కోశాధికారిగా బి.త్రిమూర్తులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి మామిడి చంద్రశేఖర్ ప్రకటించారు. అనంతరం అధ్యక్షుడిగా ఎన్నికైన జి.సూరిదేముడు అధ్యక్షతన జరిగిన మొదటి సమావేశంలో మాట్లాడుతూ మీడియా సెక్రటరీగా డబ్ల్యు.ఎన్.శర్మ, లైబ్రేరియన్ సెక్రటరీగా ఆర్.సత్యనారాయణ, కార్యవర్గ సభ్యులుగా బొడబళ్ల రామకృష్ణ, ఎన్.సత్యనారాయణ, జి.చిట్టిబాబు, జి.కోమల ప్రవీణ్, బి.వెంకట రావులను ఎన్నుకున్నట్లు తెలిపారు.

**బొండపల్లి:** గజపతినగరం న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా బిట్రా సూర్యారావు ఎన్నికయ్యారు. గురువారం న్యాయవాదుల సంఘానికి ఎన్నికలు జరిగాయి. ఉపాధ్యక్షునిగా రాపాక సాయి సురేష్, కార్యదర్శిగా పొట్నూరు శ్రీను, కోశాధికారిగా లెంక రాంబాబులు ఎన్నిక కాగా సంయుక్త కార్యదర్శిగా జెర్రిపోతుల జగదీశ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా సీనియర్ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ వ్యవహరించారు.

## మరింత అభివృద్ధి చేస్తాం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - తెర్లాం


తెర్లాం: మాట్లాడుతున్న ఎమ్‌పి బెల్లాన, ఎమ్మెల్యే శంబంగి

తమకు మరోసారి అవకాశమిస్తే మరింత అభివృద్ధి చేస్తామని ఎంపి బెల్లాన చంద్రశేఖర్, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. మండలంలోని పెరుమాలిలో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు పొందిన వారంతా మరోసారి తమను ఆశీర్వాదించి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా పెరుమాలి మాజీ సర్పంచ్ వెలగాడు కృష్ణ, కుప్ప సత్యనారాయణ, జరజాన రవి, బాణాల లక్ష్మణరావు, ముదునూరు సత్యనారాయణ రాజుతో పాటు సుమారు 15 కుటుంబాలు పార్టీలో చేరాయి. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు సత్యంనాయుడు, వైసిపి సీనియర్ నాయకులు బాబ్జిరావు, ఎఎంసి చైర్మన్ బి శ్రీనివాసరావు, తిరుమల మాజీ సర్పంచ్ కె వెంకట అప్పారావు, అప్పలరాజు, సర్పంచులు, ఎంపిటిసిలు తదితరులు పాల్గొన్నారు.

**పూసపాటిరేగ :** మరోసారి తనకు అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ పి. సురేష్‌బాబు, వైసిపి జిల్లా నాయకులు కందుల రఘుబాబు అన్నారు. గురువారం మండలంలోని గోవిందపురం, భరణికాం, లంకలపల్లి గ్రామాల్లో వైసిపి ఎన్నికల ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా వారు ఇంటింటికి తిరిగి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను, ఎంపిగా బెల్లాన చంద్రశేఖర్‌ను గెలిపించాలని కోరారు. సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాలంటే ఈ ప్రభుత్వం మరలా రావాలన్నారు. ప్రచారంలో నియోజకవర్గ పరిశీలకులు నెక్కల నాయుడు బాబు, ఎంపిపి మహంతి కళ్యాణి, వైస్ ఎంపిపిలు రమేష్, సత్యనారాయణరాజు, వైసిపి మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు, జెసిఎస్ కన్వీనర్ మహంతి శ్రీనువాసరావు, నాయకులు మహంతి జనార్ధనరావు, బర్రి చిన్నప్పన్న, గోవిందపురం నాయకులు పట్టెపు శ్రీనువాసరావు, బోర చిన్నారెడ్డి, రౌతు సాయికుమార్, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## అవకాశమిస్తే అభివృద్ధి చేస్తా

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు అవకాశం ఇవ్వాలని నెల్లిమర్ల జనసేన, టిడిపి, బిజెపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాదవి అన్నారు. గురువారం మండలంలోని కనిమెళ్ల నుండి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికి తిరిగి ఒక్క అవకాశం ఇవ్వాలని కోరారు. మీ ఇంటి ఆడపడుచుగా, మీ కుమార్తెగా తనకు అవకాశం ఇవ్వాలంటూ ప్రజలను కోరారు. ఆమెతో పాటు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మహంతి చిన్నంనాయుడు, డెంకాడ మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్, జనసేన నాయకులు పతివాడ శ్రీనివాసరావు, నక్కాన రమణ, టిడిపి నాయకులు పిన్నింటి శ్రీనివాసరావు, బొంతు రవి, పిళ్లా శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో పాల్గొన్న జనసేన, టిడిపి నాయకులు

## పబ్లిక్ నోటీసు

ఇందు మూలముగా తెలియజేయునది ఏమనగా మా క్లయింట్స్ అయిన మెరకముడిదాం మండలం, భైరిపురం గ్రామస్తులైన మారోజు విశ్వనాధం గారి కుమారులైన మారోజు శంకరనారాయణ మరియు సోదరుడు తెలియజేయునది ఏమనగా మా తల్లిదండ్రులకు మేము ముగ్గురు కుమారులము ఇద్దరు కుమార్తెలు ఇందులో మూడవ వాడైన మురళీ తన భార్య పిల్లలతో భైరిపురం గ్రామంలో నివసిస్తున్నాడు. నా క్లయింట్ మరియు ఆయన రెండవ సోదరుడు చీపురుపల్లిలో నివాసం ఉంటున్నారు. భైరిపురంలో ఉన్న మురళీ ఇంతముందు కొన్ని మోసపూరితమయిన పనులు చేసాడని తెలిసి ఆయనను మా క్లయింట్స్ మందలించడం జరిగింది. తరువాత మా క్లయింట్స్ వారి మూడువ సోదరుడుతో ఎటువంటి బంధుత్వం గాని లావాదేవీలు గాని జరపడం లేదు. తరువాత మా క్లయింట్స్‌కు మరియు వారి మూడువ సోదరుడుకు ఎటువంటి సంబంధములు లేవు. కావున ఈ బోగట్టా ఈ పత్రిక ప్రకటన ద్వారా పబ్లిక్‌కు తెలియజేస్తున్నాము.

ఇట్లు
**శ్రీ బి.వి.రమణారావు**
అడ్వకేట్, విజయనగరం,
సెల్ : 9550273135